పారిశ్రామిక ప్రాంతంలో రోడ్డెక్కిన దుకాణాలు


మల్కాపురం - సింధియా రోడ్డుపై ఏర్పాటు చేసిన దుకాణాలు


మల్కాపురం పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న రోడ్డుపై పార్క్‌చేసిన వాహనాలు

- నిత్యం ట్రాఫిక్ సమస్యలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

సింధియా: పారిశ్రామిక ప్రాంతంలో ఇటీవల శ్రీహరిపురం నుంచి సింధియా వరకు గల రహదారులపై దుకాణాలు విచ్చలవిడిగా వెలిశాయి. శ్రీహరిపురం, మల్కాపురం, సింధియా జంక్షన్ వరకు అధిక సంఖ్యలో రోడ్డుకు ఇరుపైపులా చిరువ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసి వ్యాపారాలు సాగిస్తున్నారు. కొనుగోలుదారులతో ఆ ప్రాంతమంతా నిత్యం రద్దీగా ఉంటోంది. ఫలితంగా తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. గతంలో కరోనా వైరస్ నియంత్రణ చర్యల్లో భాగంగా అటు గాజువాక.. ఇటు శ్రీహరిపురం, మల్కాపురం మార్కెట్లను తాత్కాలికంగా మూసివేశారు. దీంతో దుకాణదారులు ఇలా ప్రధాన రోడ్లపై దుకాణాలను ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు మొదలుపెట్టారు. అక్కడికి వచ్చే వారితో రద్దీ నెలకొంటోంది. వాహనాలు సైతం పార్క్‌చేసుకోడానికి సరైన స్థలం లేదు. దీంతో వాహన చోదకులు తమ వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. సెలవు రోజుల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటోంది. కరోనా ఆంక్షలు ఎత్తేసిన కూడా దుకాణదారులు రోడ్లపైనే వ్యాపారాలు సాగిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ జటిలమవుతోంది. ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు జీవీఎంసీ అధికారులు రోడ్డుకు ఇరువైపులా వ్యాపారాలు చేస్తున్న వారిని ఖాళీ చేయించి మార్కెట్‌లో దుకాణాలను కేటాయించినా.. వారంతా అక్కడికి వెళ్లకుండా రోడ్లపైనే కొనసాగిస్తున్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని స్థానికులు చెబుతున్నారు.

మార్పు శూన్యం..

ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతం గాజువాక నుంచి సింధియా మీదుగా నగరానికి వెళ్లడానికి రోజు వందల కొద్దీ వాహనాలతో ప్రజలు ప్రయాణిస్తుంటారు. కాలేజీలు, ఉద్యోగాలు, ఆస్పత్రులకు ఇలా వివిధ పనుల మీద వెళ్లే వారు ఈ మార్గాన్ని ఎక్కువగా వినియోగిస్తారు. ఈ రోడ్డులోనే కోరమాండల్, హెచ్‌పీసీఎల్ సంస్థలకు వచ్చే భారీ వాహనాలను సైతం పార్క్‌చేసి రోజులు తరబడి ఉంచడంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువవుతోంది. రాంగ్ పార్కింగ్ వాహనాలకు జరిమానాలు విధిస్తున్నా.. పార్క్‌చేయడం మానడం లేదని, రోడ్లపై వ్యాపారాలు సాగిస్తున్న వారికి అవగాహన కల్పిస్తున్నా.. మార్పు రావడం లేదని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ సమస్యలకు తక్షణం పరిష్కరించి, నిబంధనలు మీరిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు



మా ప్రాంతంలో రోడ్డుపైనే దుకాణాలు ఏర్పాటు చేసి వ్యాపారాలు చేస్తున్నారు. రోడ్డు ఇరుగ్గా మారి ప్రయాణించే మార్గం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కరోనా ఆంక్షలు ఎత్తివేసినా రోడ్లపైనే వ్యాపారాలు సాగిస్తుండటంతో ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలి.

– ఆదారి నాగరాజు, ప్రకాశ్‌నగర్

నిత్యం రద్దీగా ఉంటోంది



దుకాణాల వద్ద కొనుగోలు చేయడానికి వచ్చే వారితో మా ప్రాంతంలో నిత్యం రద్దీగా ఉంటోంది. రోడ్డు మీదే వాహనాలు పార్క్‌చేయడంతో ఇబ్బందులు పడుతున్నాం. రోజురోజుకూ దుకాణాలు ఏర్పాటు చేసే వారి సంఖ్య పెరుగుతోంది. అధికారులు చర్యలు తీసుకుని ట్రాఫిక్‌ను నియంత్రించాలి.

– సూర్యప్రకాష్, మల్కాపురం

చర్యలు తీసుకుంటున్నాం

రోడ్డుపై వ్యాపారాలు సాగిస్తున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తున్నాం. మార్కెట్‌లో వ్యాపారాలు చేసుకునేలా దుకాణదారులకు అవగాహన కల్పిస్తున్నాం. కొనుగోలుదారులకు సైతం రోడ్డుపై వ్యాపారం చేసే వారి వద్ద విక్రయాలు చేయకుండా నిలువరిస్తున్నాం. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూస్తాం.

– – తులసీరావు, మల్కాపురం ట్రాఫిక్ సీఐ

క్లుప్తంగా

ప్రమాదకరంగా అప్రోచ్ రోడ్డు


ప్రమాదకరంగా లక్ష్మీనగర్ వెళ్లే రోడ్డు

గోపాలపట్నం: ఇందిరానగర్ నుంచి లక్ష్మీనగర్ ఎగువ రోడ్డులోకి వెళ్లే అప్రోచ్ రహదారి ప్రమాదకరంగా మారింది. ఎగువ రోడ్డు ఎత్తుగా ఉండడం, పైప్‌లైన్ కోసం తవ్విన గొయ్యి మట్టితో పూడ్చినా సమాంతరంగా లేకపోవడంతో వాహన దారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు స్పందించి ప్రమాద రహితంగా రహదారి వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఘన నివాళి


ధర్మ లింగేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న షిప్‌యార్డ్ ఉద్యోగులు

సింధియా: హిందూస్తాన్ షిప్‌యార్డ్ సంస్థలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న సీహెచ్ ధర్మలింగేశ్వరరావు(35) విద్యుత్ ఘాతానికి గురై సోమవారం రాత్రి మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో షిప్‌యార్డ్ యాజమాన్యం, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు బుధవారం యూనియన్ భవనంలో ధర్మలింగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సూపర్‌వైజర్‌గా ధర్మలింగేశ్వరరావు చేసిన సేవలు చిరస్మరణీయమని, తోటి కార్మికులతో స్నేహభావంతో మెలిగే ధర్మలింగేశ్వరరావు మృతి కార్మిక లోకానికి తీరని లోటు అని కొనియాడారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ నాయకులు, షిప్‌యార్డ్ అధికారులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం


శిక్షణ తరగతుల్లో పాల్గొన్న చిన్నారులు

సింధియా: విశాఖ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం 62వ వార్డు గుడివాడ అప్పన్న కాలనీలో వేసవి శిక్షణ తరగతులు ప్రారంభించారు. పిల్లలకు పాటలు, నృత్య ప్రదర్శనలు, పేపర్ క్రాఫ్ట్, బొమ్మల తయారీ, మ్యాజిక్ షో మొదలైన వాటిపై తర్ఫీదు ఇస్తున్నట్లు క్లబ్ మల్కాపురం కన్వీనర్ అరుణ, ట్యూషన్ టీచర్ ఎస్.కృష్ణవేణి తెలిపారు. విద్యార్థుల నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ప్రతి ఏడాది సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు అరుణ చెప్పారు. కార్యక్రమంలో వీసీసీ సభ్యులు సాయి, చైతన్య, నిఖిల్, లక్ష్మి, ప్రసన్న, హేమలత, జ్యోత్స్న, స్థానిక చిన్నారులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మల్కాపురం: శ్రీహరిపురం సబ్ స్టేషన్ పరిధి జనతా కాలనీ, జవహర్‌నగర్ 11 కేవీ ఫీడర్లలో వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జోన్-2 ఈఈ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఇందిరా కాలనీ-1, 2 ప్రాంతాలు, జవహర్‌నగర్, బర్మా కాలనీ, జనతా కాలనీ, సెయింట్ ఆన్స్ ఆస్పత్రి ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

జీవో 84పై అవగాహన

మురళీనగర్: నగరంలోని యూఎల్‌సీ భూముల్లో భవనాలు నిర్మించుకుని నివసిస్తున్న వారితో పాటు ఖాళీ స్థలాల్లో డీ పట్టాల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 84పై ఆర్డీవో హుస్సేన్ అవగాహన కల్పించారు. సత్యనగర్-1లో స్థానికులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. 150 గజాల వరకు డీపట్టా ఉచితంగా అందిస్తామన్నారు. 151 నుంచి మూడు 300 గజాల వరకు మార్కెట్ విలువపై 15 శాతం, 301 నుంచి 500 గజాల వరకు 30 శాతం, 500 దాటితే వంద శాతం మార్కెట్ విలువ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన


భూమి పూజ చేస్తున్న గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం, రెడ్డివీధి ప్రాంతంలోని కోదండ రామలింగేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ఇక్కడి ఆలయం చాలా సంవత్సరాల క్రితం నిర్మించినది కావడంతో ఆ స్థానంలో అన్ని వసతులతో నూతన మందిరాన్ని నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. ఈ ఆలయంలో కోదండ రామలింగేశ్వర స్వామితో పాటు లక్ష్మీ గణపతి, అయ్యప్పస్వామి, గాయత్రీదేవి, సుబ్రహ్మణ్య స్వామి, లక్ష్మీప్రసన్న వేంకటేశ్వరస్వామి, సంతోషి మాత, అభయాంజనేయ స్వామి, షిర్డీ సాయిబాబా మందిరాలను నిర్మించనున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ ఆలయాలు మన సంస్కృతికి నిలయాలని, ఇటువంటి కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని అన్నారు. ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో గాజువాక వైఎస్సార్‌సీపీ నాయకులు తిప్పల దేవన్‌రెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు, రెడ్డివీధి కుల పెద్దలు, రామిరెడ్డి సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన వేదికలు


చిన్నారులు తయారు చేసిన వస్తువులను పరిశీలిస్తున్న భాగ్యలక్ష్మి


గ్రంథాలయంలో శిక్షణకు హాజరైన చిన్నారులు

మల్కాపురం: మన గ్రంథాలయాలు విజ్ఞాన వేదికలని ఎస్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. ఇక్కడ నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మల్కాపురం శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా చిన్నారులకు సంగీతం, డ్యాన్స్, కాగితాలతో కళాకృతుల తయారీ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం ప్రపంచంలోని దేశాలు, అక్కడి నాగరికతలు, కరెన్సీ తదితర అంశాలను భాగ్యలక్ష్మి చిన్నారులకు వివరించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జీవిత చరిత్రను, బలహీన వర్గాలకు ఆయన చేసిన సేవలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఎస్ పీవో వై.అనసూయాదేవి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు స్వాగతం


గోపాలపట్నం జంక్షన్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న చంద్రబాబు

గోపాలపట్నం: 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి..' కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్ర ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు బుధవారం విశాఖ చేరుకున్నారు. హైదరాబాద్ నుంచి 3.50కి విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న ఆయన.. రోడ్డు మార్గంలో మారియట్ హోటల్‌కు వెళ్లారు. సాయంత్రం 5.30 సమయంలో రోడ్‌షో ప్రారంభించారు. గోపాలపట్నం రైల్వేస్టేషన్ జంక్షన్ స్థానిక నేతలు ఆయనకు గజమాలతో స్వాగతం పలికారు. ఇక్కడి నుంచి నేరుగా పెందుర్తి వైపు వెళ్లారు. విశాఖ విమానాశ్రయంలో పలువురు నాయకులు ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిశారు.

మనిషి జీవితంలో కామెడీ పాత్ర కీలకం


వర్క్‌షాపు ప్రారంభంలో మాట్లాడుతున్న నరవప్రకాశరావు

ఎంవీపీకాలనీ: మనిషి జీవితంలో కామెడీ పాత్ర కీలకమని బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నరవ ప్రకాశరావు అన్నారు. బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హాస్యప్రియ కామెడీ క్లబ్ సహకారంతో నిర్వహిస్తున్న కామెడీ వర్క్‌షాపును బుధవారం ఆయన ప్రారంభించారు. కామెడీని ఆస్వాదించడం ద్వారా మంచి ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. హాస్యప్రియ కామెడీ క్లబ్ కార్యదర్శి ఈశ్వరరావు మాట్లాడుతూ ఎంవీపీకాలనీలోని వీఎంసీ కళాశాలలో జరుగుతున్న ఈ వర్క్‌షాప్ ఈ నెల 19 వరకు కొనసాగుతుందన్నారు.

ఘనంగా రెహమాన్ జన్మదిన వేడుక


ఎస్‌ఏ రెహమాన్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్న జియ్యాని శ్రీధర్, బీఎస్ కృష్ణ

గోపాలపట్నం: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, పశ్చిమ నియోజకవర్గ పరిశీలకుడు ఎస్‌ఏ రహమాన్ పుట్టిన రోజును మర్రిపాలెం వుడాలేఅవుట్‌లోని ఆయన ఇంటి ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ తదితరులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో సత్కరించారు.

పంప్ హౌస్‌లో చోరీపై పోలీసుల విచారణ

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు మిందిలోని మేఘాద్రి గెడ్డ ఫిల్టరేషన్ ప్లాంట్‌లో ఖరీదైన వాల్వ్ హెడ్‌లు, పైపులు చోరీకి గురయ్యాయి. 10 రోజుల క్రితం జరిగిన ఈ చోరీకి సంబంధించి ప్లాంట్ అధికారులు గాజువాక క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ చోరీపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గాజువాక క్రైం ఎస్ఐ మహేశ్వరరావు సిబ్బందితో కలిసి బుధవారం మింది ఫిల్టరేషన్ ప్లాంట్‌కు వెళ్లి వివరాలు సేకరించారు. పలువురు సిబ్బందిని కూడా విచారించారని సమాచారం. ప్లాంట్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సిబ్బంది చేతివాటాన్ని ప్రదర్శించారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. చోరీకి గురైన వస్తువులు సుమారు రూ.2 లక్షలకు పైగా ఖరీదు చేస్తాయని చెబుతున్నారు.

భవనంపై నుంచి పడి యువకుడి మృతి


మృతుడు విజ్జు

ఎంవీపీకాలనీ: మద్యం మత్తులో భవనంపై నుంచి జారి పడి యువకుడు మృతి చెందాడు. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలివీ.. ఒడిశాకు చెందిన విజ్జు (26) నగరంలోని ఓ హోటల్‌లో వంట మనిషిగా పనిచేస్తున్నాడు. అదే రాష్ట్రానికి చెందిన పలువురు యువకులతో కలిసి ఎంవీపీకాలనీ సెక్టార్-9లోని ఓ ఇంట్లోని రెండవ అంతస్తులో అద్దెకు ఉంటున్నాడు. మంగళవారం పనికి వెళ్లని విజ్జు మధ్యాహ్నం నుంచి మద్యం తాగుతూ ఉన్నాడు. మంగళవారం అర్ధరాత్రి మద్యం మత్తులో బయటకు వచ్చిన విజ్జు.. అదుపు తప్పి రెండో అంతస్తు నుంచి కింద పడిపోయాడు. ఈ ఘటనలో ఆయన తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని తోటి యువకులు పోలీసులకు సమాచారం అందించడంతో.. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

మితిమీరిన లోడ్‌తో ప్రయాణం


మితిమీరిన లోడుతో వెళుతున్న మినీ వ్యాన్

మల్కాపురం: పలువురు వాహనదారులు పరిమితికి మించి లోడ్లు వేస్తూ కలవరానికి గురిచేస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో స్క్రాప్,ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించి మల్కాపురం, శ్రీహరిపురంలోని స్క్రాప్ దుకాణాలకు మినీ వ్యాన్‌లతో తీసుకువస్తుంటారు. అయితే పరిమితితో కూడిన లోడ్లు వేయాలి. కానీ వ్యాన్ డ్రైవర్లు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. పరిమితికి మించి లోడ్ వేస్తుండడంతో వ్యాన్ల సామర్థ్యం సరిపోక ఓ వైపు ఒరిగిపోవడం, రోడ్డు మధ్యలో నిలిచిపోవటం తరుచూ జరుగుతున్నాయి. ఆ సమయంలో ట్రాఫిక్ స్తంభించి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పరిమితికి మించి లోడ్లు వేస్తున్నా అధికారులు కనీసం పట్టించుకోక పోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఈ సమస్యపై దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుంటాం


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఆంధ్రుల ఆత్మగౌరవంపై కేంద్ర ప్రభుత్వానికి చిన్నచూపు తగదని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు నినాదంతో సాధించుకున్న స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరంలో 825వ రోజు, బుధవారం స్టీల్‌ప్లాంట్‌లోని వలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు, ప్రాణత్యాగాల ద్వారా సిద్ధించిన స్టీల్‌ప్లాంట్‌ను కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పాలని ప్రయత్నిస్తే అమ్మేవాడికి, కొనేవాడికి కూడా ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా టెలికాం దినోత్సవం


టెలికాం పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీజీఎం మహంతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో బుధవారం ప్రపంచ టెలీ కమ్యూనికేషన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ టెలికాం విభాగం ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) బి.కె. మొహంతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన టెలికాం వ్యవస్థను సక్రమంగా నిర్వహిస్తున్న టెలికాం సిబ్బందిని అభినందించారు. సీజీఎం (మెయింటెనెన్స్) పి.కె. సారంగి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఉత్పాదకత పెంచడానికి అవసరమైన కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఏడాది టెలికాం దినోత్సవ వేడుకల థీమ్‌ను టెలికాం విభాగాధిపతి కె. శ్రీనివాసరావు వివరించారు. ప్లాంట్ వినియోగిస్తున్న టెలికాం సిస్టమ్స్‌పై ఏజీఎం సునీల్ గౌడ్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

కార్మికుల ఆర్థిక ప్రగతే ప్రభుత్వ లక్ష్యం

- మేయర్ గొలగాని హరివెంకటకుమారి


నూతన వాహనాలతో మేయర్ హరివెంకటకుమారి, అధికారులు

తాటిచెట్లపాలెం: జోన్-5 పరిధిలోని పారిశుద్ధ్య కార్మికుల కోసం నూతనంగా సమకూర్చిన వాహనాలను బుధవారం తాటిచెట్లపాలెంలోని మినీ సూయేజ్ ఫాం-5లో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా నేషనల్ సఫాయి కర్మచారి ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ) సహకారంతో నమస్తే స్కీం ద్వారా పారిశుద్ధ్య కార్మికులకు రాయితీపై రెండు పొక్లెయిన్లు, ఒక సెప్టిక్ ట్యాంకు క్లీనింగ్ వాహనాన్ని అందజేసినట్లు చెప్పారు. వాహనాల రాయితీని ఏడేళ్ల పాటు జీవీఎంసీ చెల్లిస్తుందని, దీని ద్వారా పారిశుద్ధ్య కార్మికుడికే లబ్ధి చేకూరుతుందన్నారు. తద్వారా కార్మికులు ఆర్థికంగా బలోపేతమవుతారని మేయర్ తెలిపారు. ఐదుగురు పారిశుద్ధ్య కార్మికులు గ్రూపుగా ఏర్పడి ఒక్కో వాహన నిర్వహణ బాధ్యతను చూసుకుంటారని, ప్రధాన గెడ్డల్లో పూడికలు తీసేందుకు వీటిని వినియోగిస్తామని తెలిపారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ఏఎంవోహెచ్ డాక్టర్ రాజేష్, కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సలీం నవలలు సమాజ దర్పణాలు


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

సీతంపేట: పౌర గ్రంథాలయంలో సహృదయ సాహితీ ఆధ్వర్యంలో బుధవారం ప్రముఖ రచయిత సలీం రచించిన 'రెండు ఆకాశాల మధ్య'పుస్తక పరిచయ సభ జరిగింది. సభాధ్యక్షుడు సహృదయ సాహితీ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ సలీం నవలలు సమాజ దర్పణాలు అని కొనియాడారు. సలీం రచించిన 29 నవలల్లో కాలుతున్న పూలతోటకి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించిందని గుర్తు చేశారు. రెండు ఆకాశాల మధ్య నవలలో భారత్, పాకిస్తాన్ సరిహద్దు గ్రామాల ప్రజల దుర్భర జీవితాలను హృద్యంగా, సజీవంగా తనదైన శైలిలో పొందుపర్చారన్నారు. అనంతరం పుస్తకాన్ని అతిథులతో కలిసి ఆవిష్కరించారు. రచయిత కె.జి.వేణు మాట్లాడుతూ దేశ విభజన సమయంలో జరిగిన దారుణమైన నరమేధాన్ని చిత్రీకరించిన గొప్ప నవలగా అభివర్ణించారు. ప్రముఖ రచయిత ఎల్.ఆర్.స్వామి మాట్లాడుతూ సలీం రచనలు అందరినీ చదివింపజేస్తాయని, అనేక ఇతర భాషల్లో అనువదించారన్నారు. రచయిత ఆదూరి వెంకట సీతారామమూర్తి, సీహెచ్ చిన సూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణ మూర్తి, డి.వి.సూర్యారావు, ద్విభాష్యం రాజేశ్వరరావు, అర్నాద్, మేడా మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేద విద్యను పునఃప్రారంభించాలని వినతి


స్పీకర్ తమ్మినేనికి వినతిపత్రం అందజేస్తున్న శివరామ, గొండు సీతారాం

బీచ్‌రోడ్డు: పూర్వం గురుకులాలు, విశ్వ విద్యాలయాల్లో వేదాలు, వాస్తు, జ్యోతిష్య శాస్త్రం విద్యను బోధించేవారని, మళ్లీ ఆ విద్యను పునఃప్రారంభించి భావితరాలకు అందించాలని అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాంకు వాస్తు జ్యోతిష్య పండితుడు లక్కోజు శివరామ కోరారు. నగరానికి వచ్చిన స్పీకర్‌ను బుధవారం ప్రభుత్వ అతిథిగృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో చాలా మంది విద్యార్థులు జ్యోతిష్య శాస్త్రం చదివేందుకు ఆసక్తి చూపిస్తున్నారని అందులో పేర్కొన్నారు.

కమిషన్ మరింత చేరువ కావాలి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పిల్లలకు మరింత చేరువ కావాలని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. నగర పర్యటనకు వచ్చిన ఆయన్ని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం కలిశారు. ఏడాది కాలంగా కమిషన్ చేపట్టిన కార్యక్రమాల నివేదికను ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ దేశంలో ఇతర రాష్ట్రాల బాలల హక్కుల కమిషన్‌కు దీటుగా మన రాష్ట్ర కమిషన్ పనిచేయాలన్నారు.